# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 05 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

### గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 6, 7 తేదీల్లో ..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నవరాత్రుల అనంతరం గణనాథులు గంగమ్మ ఒడికి చేరే సమయం దగ్గరపడింది. గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 6, 7 తేదీల్లో హైదరాబాద్ నగరంలో పోలీసులు భారీ ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయనున్నారు. దాదాపు 28 గంటలపాటు కీలక మార్గాలలో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. శోభాయాత్రలు సాఫీగా సాగేందుకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు.

**ప్రధాన శోభాయాత్ర మార్గాలు**

బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర బాలాపూర్ నుంచి ప్రారంభమై చాంద్రాయణగుట్ట, చార్మినార్, అబిడ్స్, లిబర్టీ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి వచ్చే విగ్రహాలు పాట్నీ, పారడైజ్, రాణిగంజ్ మీదుగా వస్తాయి. టోలిచౌకీ, మెహిదీపట్నం నుంచి వచ్చే విగ్రహాలు ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తాయి. టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలను ఎంజే మార్కెట్ వరకు మాత్రమే అనుమతిస్తారు. మిగితా 2వ పేజీలో

## దీపావళి ముందే ఆనందం వచ్చింది

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఉపాధ్యాయ అవార్డు విజేతలతో సంభాషణ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశ ప్రజలకు దీపావళి పండుగ ముందే ఆనందం వచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉపాధ్యాయ అవార్డు 2025 విజేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా జీఎస్టీ సంస్కరణలు పౌరుల జీవన నాణ్యతను మెరుగుపరుస్తాయని, వినియోగం-వృద్ధికి బూస్టర్ డోస్‌గా నిలుస్తాయని తెలిపారు.విదేశాల నుంచి వస్తువులు దిగుమతి చేసుకునే విధానంలో మార్పు అవసరమని, వంటనూనెలకే ప్రతి సంవత్సరం లక్షకోట్లు ఖర్చవుతున్నాయని, ఆ నిధులు దేశంలోనే ఉంటే పాఠశాలల అభివృద్ధికి వినియోగించవచ్చని సూచించారు.

కొత్త ఆవిష్కరణలతో ఆత్మనిర్భర్ భారత్ ముందుకు దూసుకెళ్తోందని మోదీ అన్నారు. చంద్రయాన్ విజయంతో విద్యార్థుల్లో శాస్త్రవేత్తలవ్వాలనే ఆకాంక్ష పెరిగిందని పేర్కొన్నారు. చిన్నారుల్లో డిజిటల్ దుష్ప్రభావాన్ని తగ్గించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, గ్యాంబ్లింగ్‌పై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుందని, యువతను రక్షించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. సరైన దారిలో వెళ్తే ఆన్‌లైన్ గేమింగ్ రంగంలో భారత్ ఆధిపత్యం చెలాయించగలదని, ఈ రంగంలో ఉద్యోగావకాశాలు విస్తారంగా ఉన్నాయని చెప్పారు.

'హర్ ఘర్ స్వదేశీ-ఘర్‌ఘర్ స్వదేశీ' నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని పిలుపునిచ్చారు. స్వదేశీ విధానంతోనే దేశం మరింత స్వావలంబన సాధిస్తుందని, విద్యార్థి దశ నుంచే దేశీయ ఉత్పత్తులను వినియోగించే అలవాటు పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో, ప్రతి దుకాణంలో 'స్వదేశీ' బోర్డు ఉండాలని కోరారు. దేశీయ ఉత్పత్తుల వినియోగంతో దేశ రూపురేఖలు మారిపోతాయని, దేశభక్తి, ఆత్మగౌరవంతో దేశాన్ని ముందుకు నడిపించవచ్చని ఆయన అన్నారు.

జీఎస్టీ స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద ఆర్థిక సంస్కరణల్లో ఒకటని మోదీ స్పష్టం చేశారు. ఎనిమిది సంవత్సరాల క్రితం జీఎస్టీ అమలు దేశానికి దశాబ్దాల కలను సాకారం చేసిందని గుర్తుచేశారు. ఈ సంస్కరణలు సాధారణ ప్రజల డబ్బు ఆదా చేయడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని అన్నారు.

## గణేష్ నిమజ్జనానికి 30వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వినాయక చవితి నిమజ్జనాన్ని శాంతియుతంగా పూర్తి చేయడానికి హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమగ్ర చర్యలు చేపడుతున్నట్టు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ విభాగం నుంచి 19 వేల మంది, జిల్లాల నుంచి 8,500 మంది సిబ్బందిని మోహరించారు. అదనంగా 42 ప్లాటూన్లు, 10 సీఏపీఎఫ్ కంపెనీలు, ఆక్టోపస్ బృందాలను నిమజ్జన భద్రత కోసం వినియోగిస్తున్నారు. మొత్తం 30 వేల మంది సిబ్బంది విధుల్లో ఉంటారు.

నగరంలోని 10,900 గణేష్ మండపాలకు ఆన్‌లైన్ అనుమతులు జారీ కాగా, వీటన్నింటికీ జియోట్యాగింగ్ పూర్తయింది. నిమజ్జన ఊరేగింపులను సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, క్యూఆర్ కోడ్ స్టిక్కర్లతో కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించనున్నారు.

ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా వద్ద ఉమ్మడి నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ టీజీ ఐసీసీసీ వద్ద 24 గంటలూ పనిచేసే కేంద్రం సిద్ధం చేశారు. హుస్సేన్ సాగర్, మీరాలం ట్యాంక్, రాజన్న భావి, ఎన్టీఆర్ స్టేడియం ప్రాంతాల్లో 40 క్రేన్లను ఏర్పాటు చేశారు. ట్యాంక్‌బండ్‌పై కూడా 40 క్రేన్లు సిద్ధంగా ఉంచారు.

ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనాన్ని సెప్టెంబర్ 6వ తేదీ మధ్యాహ్నం వరకే పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. బడా గణేష్ నిమజ్జనాన్ని ముందుగా పూర్తి చేస్తే మిగతా విగ్రహాలు వేగంగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. పోలీసులు నగరవ్యాప్తంగా ముమ్మర పెట్రోలింగ్ చేస్తున్నారు. బ్లూకోట్ సిబ్బందిని కీలక ప్రాంతాల్లో మోహరించారు. పెట్రోలింగ్ వాహనాలకు కెమెరాలు అమర్చి, ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ నుంచి ఆదేశాలు జారీ చేస్తున్నారు. కొందరు పోలీసులకు బాడీ వార్న్ కెమెరాలు కూడా అందజేశారు. ట్రాఫిక్ జామ్‌లు, అత్యవసర పరిస్థితులకు వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు.

## డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్



**- గ్రిండర్ - ఏ గే డేటింగ్ యాప్‌లో మార్కెటింగ్**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కొందరు గేలు ప్రత్యేక డేటింగ్ యాప్‌ల ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. రహస్యంగా కొనసాగుతున్న ఈ దందాపై చిలకలగూడ పోలీసులు, టాస్క్‌ఫోర్సు పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. సీతాఫల్ మండిలో దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 100గ్రాముల ఏండీఏంఏ డ్రగ్స్, 10సెల్‌ఫోన్లు, వేయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.15,00,000లు ఉంటుందని డీసీపీ తెలిపారు. గురువారం అంబర్‌పేట్‌లోని ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీలు ఏ.శ్రీనివాస్‌రావు, జే.నర్సయ్య, ఏసీపీ శంకర్‌రెడ్డితో కలిసి డీసీపీ బాలస్వామి వివరాలను వెల్లడించారు. చిలకలగూడాకు చెందిన ఏం.రమాకాంత్, మీర్‌పేట్‌కు చెందిన ముదావత్ ప్రసాద్‌లు పాత నేరస్తులు. డిగ్రీపూర్తి చేసిన అనంతరం ఏం.రమాకాంత్ ఉపాధి కోసమని 2000లో హైదరాబాద్‌కు వచ్చాడు. ప్రేవేట్ సంస్థలో పనిచేస్తున్న సమయంలో పెండ్లిచేకున్నాడు. నాలుగైదు ఏండ్ల తర్వాత ఇతర ప్రవర్ధన నచ్చక అతని భార్యవిడిపోయింది. అప్పటి నుంచి ఒటరిజీవితానికి అలవాటైన రమాకాంత్ ఇందిరాపార్క్, సంజీవ్యపార్క్, పరేడ్ గ్రౌండ్స్, బస్టాండ్స్‌తోపాటు వివిధ ప్రాంతాలల్లో గేగా సంచరిస్తూ హెూమో సెక్సువల్‌గా పరిచయాలు చేసుకునేవాడు. ఈ క్రమంలో డ్రగ్స్‌కు బానిసై ఇంటర్నేషనల్‌గా కొనసాగే డేటింగ్ యాప్‌లను ఉపయోగించేవాడు. గ్రిండర్-ఏ గే డేటింగ్ యాప్ ద్వారా ముదావత్ ప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి బెంగుళూర్‌లో నివాసముంటున్న ఓ నైజీరియన్‌తో పరిచయం పెంచుకున్నారు. అతని సహాయంతో డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు. వాటిని రూ.10వేలకు కొనుగోలు చేస్తున్న నిందితులు గ్రిండర్-ఏ గే డేటింగ్' యాప్‌ద్వారా (డ్రగ్స్ కావాల్సిన వారు, డ్రగ్స్‌ను విక్రయించే వారు) యాప్ గ్రూప్‌లో 'రాకెట్, పిజియన్, విమానం' సింబల్స్ పెట్టి, కావాల్సి వారికి రూ.15వేలకు విక్రయిస్తున్నారు. ఇద్దరు నిందితులను విచారిస్తే మరో 7గురి వినియోగ దారుల వివరాలు వెలుగుచూశాయి. ఈ గ్రూప్‌లో మరికొంత మంది పేర్లు ఉండే అవకాశముందని డీసీపీ బాల స్వామీ తెలిపారు. డ్రగ్స్ కేసులో ఉన్న నైజీరియన్ పాస్‌పోర్టు స్వాధీనం చేసుకుని తిరిగి వారిదేశానికి పంపిస్తారని డీసీపీ తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని డీసీపీ కోరారు. వారు ఎటువెళ్తున్నారు, ఎవరితో స్నేహం చేస్తున్నారు, అసలు ఏంచేస్తున్నారో గమనించాలన్నారు. చెడువ్యసనాలకు అలవాటుపడి, డ్రగ్స్ కేసులో చిక్కుకుంటే పిల్లల్ల జీవితాలు నాశనమవుతాయని డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ఎస్‌హెచ్‌వో బీ.అనుదీప్, ఎస్ఐ మానుషారెడ్డి, టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్లు ఏ. నాగార్జున, ఎస్.కరుణాకర్ రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన మత్స్యశాఖ అధికారి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మత్స్యకారులకు సభ్యత్వం ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారి ఏసీబీ వలలో చిక్కారు. డీఎస్పీ శరత్‌చంద్ర తెలిపిన వివరాల ప్రకారం- కేతెపల్లి మండలం బొప్పారం గ్రామ చెరువు మత్స్య సహకార సొసైటీలో కొత్తగా 17 మందికి సభ్యత్వం ఇచ్చేందుకు అధికారి చరితారెడ్డి రూ.70 వేలు లంచం కోరారు. చివరికి సొసైటీ బాధ్యుడు శ్రీనివాస్ ద్వారా రూ.50 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో రూ.20 వేలు లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం చరితారెడ్డి కార్యాలయంతో పాటు హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆమె ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.



ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శరత్‌చంద్ర వెల్లడించారు.

# పంట నష్టపరిహారం అందజేస్తాం

- వరద బాధితులను ఆదుకుంటాం
- వందేండ్లలో రాని వరద వచ్చింది
- ఇండ్లు నష్టపోయిన వారికి ప్రత్యేక కోటా
- కష్టం వచ్చినప్పుడు అండగా ఉండే వారే నిజమైన నాయకుడు.
- కొడంగల్‌తో సమానంగా కామారెడ్డి అభివృద్ధి
- కామారెడ్డి జిల్లా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారీ వర్షాలు, వరదల వల్ల నష్టం జరిగిన చోట శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వరదల వల్ల పంట పొలాల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తామని చెప్పారు.రోడ్లు, పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి స్థానికులతో మాట్లాడారు. కొడంగల్‌కు ఎంత మేరకు సాయం చేస్తానో కామారెడ్డి జిల్లాకు కూడా అంత సాయం చేస్తానని మాటిచ్చారు. వరద నష్టంపై గ్రామాల వారిగా అంచనాలు రూపొందించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జీలు, మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు పంట నష్టానికి సహాయం అందిస్తామన్నారు. ఇటీవలి భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ గారు, సలహాదారు షబ్బీర్ అలీ గారు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు, ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు గారు, తోట లక్ష్మీ కాంతారావు గారు, కాటిపల్లి వెంకట రమణారెడ్డి గార్లతో ఆయా ప్రాంతాలను పరిశీలించారు.

"వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద వచ్చింది. నష్టపోయిన వారిని ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుంది. అన్ని సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో వరదల నష్టాన్ని అంచనా వేయాలి. పంట నష్ట పోయిన రైతులకు పరిహారం అందిస్తాం. రోడ్లు, ప్రాజెక్టులను మరమ్మతులు చేసేందుకు కూడా అంచనాలు రూపొందించాలి" అని అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు."వరదల వల్ల ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుప్రజలకు అండగా నిలిచారు. కష్టం వచ్చినప్పుడు అండగా ఉండే వారే నిజమైన నాయకుడు. ఎమ్మెల్యే గారి లాగే కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు మిగితా 2వ పేజీలో

## రాజకీయాలకతీతంగా మానవత్వంతో వ్యవహరించాలి



- సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రజలకు సమస్యలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కోరారు. వరదల కారణంగా నష్టపోయిన కామారెడ్డి జిల్లాలో తీసుకునే చర్యలు సంక్షోభ నివారణలో ఒక మాడల్ జిల్లాగా నిలవాలని అన్నారు.సహాయక చర్యలకు సంబంధించి అధికారులు పరిష్కారాలతో అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు. వారి అంచనాల ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, 15 రోజుల తర్వాత మరోసారి పరిస్థితులను సమీక్షిస్తామని చెప్పారు.వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి సమీకృత కలెక్టరేట్ భవనంలో ఉన్నతస్థాయి సమావేశంలో పరిస్థితులను సమీక్షించారు. ప్రజలను ఆదుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై అదికారులకు పలు సూచనలు చేశారు.

ఇలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రభుత్వానికి సంబంధించి అన్ని శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమని నొక్కి చెప్పారు. వరదలొచ్చినప్పుడు దాని ప్రభావం, పర్యవసనాలు నీటి పారుదల, వ్యవసాయం, విద్యుత్, మిగితా 2వ పేజీలో

## జాతీయ విపత్తుగా పరిగణించాలి

- కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాకు భట్టి, తుమ్మల విజ్ఞప్తి
- రూ.5,018.72 కోట్లు నష్టంగా ప్రాథమిక అంచనా



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లిందని, జాతీయ విపత్తుగా పరిగణించి ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. తాజా ప్రాథమిక అంచనా ప్రకారం... రూ.5,018 కోట్లు నష్టం వాటిల్లిందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గత విపత్తు, తాజా ప్రకృతి విలయాన్ని పరిగణనలోకి తీసుకొని మొత్తం రూ.16,732 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. అమిత్ షా నివాసంలో దాదాపు అరగంట పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) అరవింద్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఉన్నారు. ఈ సందర్భంగా వరద నష్టంగాపై ప్రాథమిక అంచన నివేదిక, వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తెలంగాణలో పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని వివరించారు. కేంద్రం తక్షణమే సాయం అందించాలని కోరారు. ఆగస్టు 25 నుంచి 28 మధ్య తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని వివరించారు. ప్రధానంగా కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వరదలు సంభవించి భారీ నష్టం జరిగిందన్నారు. ఈ జిల్లాల్లో మౌలిక సదుపాయాలకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని, రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం సాధారణం కంటే 25 శాతం అధికంగా ఉందని అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. ఎనిమిది జిల్లాల్లో 65 నుంచి 95 శాతం అదనపు వర్షపాతం నమోదైందని వివరించారు. వర్షాలు కొనసాగుతూనే ఉండటంతో మనుషులతో పాటు మూగ జీవులు, పశువులు ప్రాణాలు కోల్పోయాయన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులు, పంట పొలాలకు నష్టం వాటిల్లిందన్నారు.

గతంలోనూ రాష్ట్రంలో భారీ వర్షాలతో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు కేంద్రం సహకరించలేదని గుర్తు చేశారు. గతేడాది ఖమ్మం, పరిసర జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా భారీ నష్టం జరిగిందన్నారు. వరద నష్టం కింద రాష్ట్రానికి రూ.11,713 కోట్ల ఆర్థికసహాయం మిగితా 2వ పేజీలో

## భారత్-ఈయూ సదస్సుపై యూరోపియన్ నేతలతో మోడీ చర్చలు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తదుపరి భారత్-ఈయూ శిఖరాగ్ర సదస్సు గురించి యూరోపియన్ నాయకులతో ప్రధాని మోడీ గురువారం ఫోన్ ద్వారా చర్చించారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షులు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో ఈ చర్చలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 'విశ్వాసం, భాగస్వామ్య విలువలు, భవిష్యత్‌పై ఏక దృక్పథంపై నిర్మించబడిన బలమైన, సన్నిహిత సంబంధాన్ని ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య శక్తులు భారత్-ఈయూ పంచుకుంటాయి' అని ప్రకటన తెలిపింది. అలాగే గురువారం చర్చల్లో ప్రపంచ సమస్యలను సంయుక్తంగా పరిష్కరించడం, ప్రపంచ స్థిరత్వాన్ని పెంపొందించడం, పరస్పర శ్రేయస్సును ప్రోత్సహించడంలో భారత్-ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం పాత్రను నాయకులు ప్రత్యేకంగా ప్రస్తావించారని ప్రకటన తెలిపింది. తదుపరి భారత్-ఈయూ శిఖరాగ్ర సదస్సును భారత్‌లో ముందస్తుగానే నిర్వహించడం గురించి ఈ చర్చలు జరిగాయి. మరిన్ని చర్చలు జరపడానికి నాయకులు అంగీకరించారు. అలాగే, ఈ సదస్సు కోసం నాయకులను మోడీ భారత్‌కు ఆహ్వానించారు.

## ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాల్లో ఆకతాయిలపై షీ టీమ్స్ ఉక్కుపాదం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాల సందర్భంగా మహిళలు, యువతులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలకు షీ టీమ్స్ చెక్ పెట్టాయి. తొమ్మిది రోజుల వ్యవధిలో 930 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. పవిత్ర వాతావరణంలో అల్లరి పనులకు పాల్పడుతున్న వారి ఆటకట్టించారు. భక్తులు, ముఖ్యంగా మహిళలు, యువతులు పెద్ద ఎత్తున గణేశ్ దర్శనానికి రావడంతో కొందరు అసభ్య చర్యలకు పాల్పడుతున్నారని షీ టీమ్స్ గుర్తించాయి. మఫ్టీలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో 55 మంది మైనర్లు ఉన్నారని సమాచారం. మహాగణపతి మండపం పరిసరాల్లో 15 మంది షీ టీమ్స్ సిబ్బందిని మోహరించామని పోలీసులు తెలిపారు. నిమజ్జన సమయంలో ఎవరు మహిళలను వేధించినా వెంటనే డయల్ 100లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## 120 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఈ ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025కు 120 మంది టీచర్లని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 49 మంది, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లు 11 మంది, డిగ్రీ కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు 56 మంది, సాంకేతిక విద్యాశాఖలో నలుగురు అధ్యాపకులు కలిపి మొత్తం 120 ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారికి గురుపూజోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవార్డులను ప్రదానం చేస్తారు. వారిని సన్మానించడంతోపాటు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువా, బంగారుపూత పూసిన రజత పతకాన్ని అందజేస్తారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలతోపాటు మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే.భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు ప్రత్యేక అతిథులుగా శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు విశిష్ట అతిథిగా సీఎస్ కె రామకృష్ణారావు పాల్గొంటారు.

## తిరుపతి వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతి వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్‌టిసి శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే లహరి ఎసి బస్సుల్లో ఆర్‌టిసి ప్రత్యేక రాయితీ కల్పిస్తోంది. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు లహరి ఎసి బస్సుల్లో 10 శాతం ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్‌టిసి ప్రకటించింది. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని తెలిపింది. టికెట్ రిజర్వేషన్ కోసం ఆన్లైన్ www.tgsrtcbus.in ఆర్‌టిసి అధికారిక వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చని సూచించింది. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆర్‌టిసి ప్రకటించింది.

## అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అప్పుల బాధతో ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం చేరిలా గ్రామంలో గురువారం జరి గింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిర్జాపల్లి బాబు (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇల్లు కట్టుకొని, రెండు ఎకరాల పొలం కొన్నాడు. వాటి కోసం రూ.25లక్షలు అప్పుచేయగా రూ.5 లక్షలు చెల్లించినా ఇంకా రూ.20లక్షల అప్పు ఉంది. ఈ క్రమంలో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసి అప్పులు తీరుద్దామను కున్నాడు. పంటలు సరిగ్గా పండకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. అప్పు ఇచ్చిన వారు పదేపదే అడగడంతో మనస్తాపానికి గురయ్యాడు. కాగా, రోజులాగే గురువారం కూడా పొలానికి నీరు పారపెట్టేందుకు ఉదయం వెళ్లిన బాబు.. చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకొని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. భార్య షేకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు.

# ఎస్ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణ ప్రారంభించాలి



- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ ప్రాజెక్ట్ (ఎస్ఎల్‌బీసీ) పనుల పునరుద్ధరణ వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అధికారులను అదేశించారు. ఇకనుంచి ఒక్కరోజు కూడా ఆలస్యం కాకుండా పనులు జరగాలని చెప్పారు. 2027డిసెంబరు 9 లోగా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి 2027 డిసెంబర్ 9 న తెలంగాణ ప్రజలకు అంకితమివ్వాలని ముఖ్యమంత్రి గడువు నిర్దేశించారు. గడువు లోగా పనులు పూర్తి చేసేందుకు ప్రతి మూడు నెలల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్ట్ ఫ్లోరోసిస్ పీడిత నల్గొండ జిల్లాకే కాకుండా తెలంగాణకు అత్యంత కీలకమని, ప్రపంచస్థాయి అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పక్కడ్బందీగా పటిష్టవంతమైన రక్షణ చర్యలతో ముందుకు సాగాలని చెప్పారు. ఎస్ఎల్బీసీ పనుల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి గారు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, నీటి పారుదల శాఖ సలహాదారులు ఆదిత్యనాథ్ దాస్ గారు, లెఫ్ట్ నెంట్ జనరల్ హర్పాల్ సింగ్ గారితో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సొరంగం పనుల్లో అనుభవం కలిగిన ఆర్మీ అధికారుల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. సర్వేతో పాటు పనులు పూర్తి అయ్యేంత వరకు ఆయా రంగాల్లో నిష్ణాతులైన అన్ని ఏజెన్సీల సలహాలు, వారి భాగస్వామ్యంతో యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగించాలని అదేశించారు.భవిష్యత్ లో దేశ విదేశాల్లో చేపట్టే టన్నెల్ ప్రాజెక్ట్ లకు ఆదర్శంగా ఉండేలా ఎస్-ఎల్‌బీసీ నిర్మాణం ఒక కేస్ స్టడీగా నిలవాలని ఆకాంక్షించారు. అటవీ శాఖ, ఇంధన శాఖ ఇరిగేషన్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ఈ నెల 15 వ తేదీలోగా కేబినేట్ సమావేశమై ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ పనులకు అవసరమైన అన్ని అనుమతులు, నిర్ణయాలు తీసుకోవాలని నిర్దేశించారు.

టన్నెల్ ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న సమస్యను ఒక్క సమావేశంలోనే పరిష్కారం రావాలని, అటవీ, విద్యుత్ సరఫరా, సొరంగం తవ్వకంలో సింగరేణి నుంచి నిపుణుల సేవల వంటి అన్ని అంశాలు కొలిక్కి రావాలని చెప్పారు. గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వడానికి అవకాశం ఉన్న ఈ టన్నెల్ ప్రాజెక్టు ఎన్నో ఏళ్లుగా తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారని ముఖ్యమంత్రి గారు అన్నారు.సొరంగం పనులను వేగంగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టు సంస్థ జేపి అసోసియేట్స్ అన్ని పరికరాలను సిద్ధం చేసుకోవాలని, ఇకనుంచి ఒక్క రోజు కూడా పనులు ఆలస్యం చేసినా ఒప్పుకునేది లేదని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారు. పనులు ఆగకుండా ఇన్‌లెట్, అవుట్‌లెట్ రెండు వైపుల నుంచి పనులు చేపట్టాలని సూచించారు.

ఎస్ఎల్‌బీసీ పనులకు గ్రీన్ ఛానల్లో నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. మొత్తం 44 కిలోమీటర్ల సొరంగ మార్గానికి గాను ఇప్పటికే 35 కి.మీ సొరంగం తవ్వడం పూర్తయిందని, మిగిలిన 9 కి.మీ. సొరంగ మార్గం తవ్వడానికి గాను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నట్టు ఈ సందర్భంగా పరీక్షిత్ మెహ్రా గారు వివరించారు. ప్రతి నెల 178 మీటర్ల మేరకు సొరంగం తవ్వే లక్ష్యంగా ప్రపంచంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడిన హెలీ-బోర్న్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్జీఆర్ఐ ద్వారా ఈ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో సొరంగం తవ్వకాల సమయంలో ముందుగానే ప్రమాదాలను పసిగట్టే వీలుంటుందని తెలిపారు.

# రాజకీయాలకతీతంగా మానవత్వంతో వ్యవహరించాలి

(మొదటి పేజీ తరువాయి)

రోడ్లు భవనాలు, మున్సిపాలిటీ.. ఇలా ఒకదానిపై ఇంకొకటి ఆధారపడి ఉంటుందని అన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని పలు అంశాలను ఉదహరించారు.

వరదల వల్ల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జరిగిన నష్టంపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో రోజంతా ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని ఇంచార్జీ మంత్రి ధనసరి సీతక్క గారికి సూచించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి జరిగిన నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. అధికారుల ప్రతిపాదనలపై తక్షణం నిధులను విడుదల చేసి ప్రజలను ఆదుకుంటామన్నారు. కామారెడ్డిలో గతంలో ఎప్పుడూ లేనంత వర్షం కురవడం, భారీ వరదల సమయంలో ఎమ్మెల్యే గారు, ఎస్టీఆర్ఎఫ్ (%ాణక్ష్మఖీ%), ఆయా శాఖల అధికారులు ప్రజలకు సహకరించారని చెబుతూ, ఆపత్కాలంలో సిబ్బంది రోజుకు 24 గంటలు పని చేశారంటూ ముఖ్యమంత్రి గారు వారికి అభినందనలు తెలిపారు. సిబ్బంది బాగా స్పందించినప్పటికీ శాఖల మధ్య కొంత సమన్వయ లోపం కనిపించిందన్నారు.

ఎరువుల విషయంలోనూ క్షేత్రస్థాయిలో గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా చూడాలని, ముఖ్యంగా రైతు వేదికల వద్ద సమావేశాలు ఏర్పాటు చేసి ముందుగానే టోకెన్లు జారీ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని చెప్పారు. యూరియా అందుబాటులో ఉన్నా ఒక్కసారిగా ఎక్కువ మంది లైన్లో నిలబెట్టడం ద్వారా చివరన ఉన్న వారు సహనం కోల్పోయే పరిస్థితి ఉత్పన్నమవుతుందని, యూరియాకు సంబంధించి స్థానికంగా సమన్వయం చేసుకోవాలని చెప్పారు.

వరదలొచ్చినప్పుడు ఎదుర్కొనడానికి తక్షణం తాత్కాలిక చర్యలు తీసుకున్నప్పటికీ భవిష్యత్తులో ఇలాంటి సందర్భాలను నివారించడానికి, ప్రణాళికా బద్ధమైన శాశ్వత పరిష్కారాలు ఉండాలన్నారు. విపత్తు సహాయం విషయంలో నిబంధనల మేరకు కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవాలని అధికారులకు చెప్పారు. వరదల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలకు ఈ సందర్భంగా పరిహారానికి సంబంధించిన పత్రాలను అందించారు.

ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, సలహాదారు షబ్బీర్ అలీ గారు, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ గారు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస రెడ్డి గారు, మదన్ మోహన్ రావు గారు, సుదర్శన్ రెడ్డి గారు, కాటిపల్లి వెంకట రమణారెడ్డి గారు, తోట లక్ష్మీకాంతరావు గారు, జిల్లా కలెక్టర్ గారు, ఎస్పీ గారితో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు ఆర్థిక సాయమివ్వండి

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు ఆర్థిక సాయం అందించాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విద్యా నాణ్యత, పిల్లల పోషకాహారం అందించే లక్ష్యంతో ఈ స్కూల్స్ ను ప్రవేశ పెట్టినట్టు తెలిపారు. ఈ మేరకు గురువారం నాడిక్కడ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను.. ఆమె కార్యాలయంలో కలిసి విజ్ఞప్తులు అందజేశారు. ఈ భేటిలో డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, లోన్‌ల రీస్ట్రక్చర్, విద్యా సంస్థలకు కేంద్ర సాయం, ఇతర అంశాలపై చర్చించారు. తెలంగాణ చేపట్టిన కుల గణన సర్వేలో 56.33 శాతం బీసీలు, 17.43 శాతం ఎస్సీ, 10.45 శాతం ఎస్టీలు ఉన్నట్టు తేలిందని వివరించారు. అయితే విద్యా, పోషకాహార రంగాలలో ఫలితాలు తక్కువగా ఉన్నాయని ఈ అసమానతలు తరతరాలుగా పేదరికాన్ని రూపుమాపనివ్వడంలేదన్నారు. ఈ అంతరాలను పరిష్కరించడానికే.. తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ విధానాన్ని రూపొందించిందని వివరించారు. ఈ సమగ్ర విద్యా విధానం కోసం రూ.30 వేల కోట్లు అంచనా వ్యయంగా ఉందన్నారు. ఇందులో 105 క్యాంపస్‌ల నిర్మాణానికి రూ.21 వేల కోట్లు, విద్యా రంగంలో అనుబంధ పెట్టుబడులకు రూ.9,000 కోట్లు అంచనా వేసినట్టు తెలిపారు. ఒక్కో స్కూల్‌లో 5 నుంచి12 తరగతుల వరకు దాదాపు 2,560 మంది విద్యార్థులుంటారని చెప్పారు. దాదాపు 2.7 లక్షల మంది విద్యార్థులు ప్రత్యక్షంగా లబ్ది పొందుతారని, ఇదే సందర్భంలో దాదాపు 5,250 పొరుగు ప్రభుత్వ పాఠశాలలకు మద్దతు ఇచ్చే కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. అందువల్ల ఈ స్కూల్స్ ను ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయింపును ఇస్తే.. నిధుల సమీకరణకు మార్గం సగమం అవుతుందని విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా అందించాలని కోరారు.

# నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)



## ట్రాఫిక్ మళ్లింపులు

సౌత్ ఈస్ట్ జోన్‌లో కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను మళ్లించనున్నారు. అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, లిబర్టీ, ఖైరతాబాద్, బుద్ధభవన్ జంక్షన్లలో కఠిన ఆంక్షలు అమలవుతాయి. సికింద్రాబాద్ జోన్‌లో పాట్నీ, పారడైజ్, రాణిగంజ్ చౌరస్తాలలో వాహనాలను ఇతర మార్గాలకు మళ్లిస్తారు.

## ప్రజలకు సూచనలు

విమానాశ్రయ ప్రయాణికులు పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా ఓఆర్ఆర్ మాత్రమే వాడాలని సూచించారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్ళేవారు బేగంపేట%-%పారడైజ్ మార్గం తీసుకోవాలి.

అంతర్ రాష్ట్ర, జిల్లా బస్సులను చాదర్‌ఘాట్ వైపు మళ్లించనున్నారు.

ఆర్టీసీ బస్సులు రద్దీ సమయాల్లో నగర పరిధిలోని కొన్ని ప్రాంతాలకే పరిమితం కానున్నాయి.

## భారీ వాహనాల నిషేధం, పార్కింగ్

సెప్టెంబర్ 6 ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 7 రాత్రి 11 గంటల వరకు నగరంలోకి లారీల ప్రవేశం నిషేధం. భక్తుల సౌకర్యార్థం ఎన్టీఆర్ స్టేడియం, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధభవన్ వెనుకభాగం, ఆదర్శనగర్, ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్ వంటి ప్రదేశాల్లో ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించారు.

పర్యావరణ హిత నిమజ్జనం కోసం 10 బేబీ పాండ్లు, 8 పోర్టబుల్ వాటర్ ట్యాంకులు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ఏవైనా సమాచారం కోసం 040-27852482, 8712660600, 9010203626 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

# పంట నష్టపరిహారం అందజేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తోడుగా ఉండాలని నాయకులకు సూచిస్తున్నా.

వరదలకు మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. పోచారం ప్రాజెక్టు భారీ వరదను కూడా తట్టుకుని నిలబడి అందర్నీ కాపాడింది. తాత్కాలిక మరమ్మతులు చేశాం. అయితే ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడానికే ఇక్కడికి వచ్చాం. నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం..” అని ముఖ్యమంత్రి గారు బాధితులకు భరోసానిచ్చారు.

మొదట తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులతో కలిసి వరదల వల్ల దెబ్బ తిన్న ప్రాంతాలను పరిశీలించారు. వరదల వల్ల లింగంపేటలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి బ్రిడ్జిని పరిశీలించారు. వరదలు వచ్చిన సందర్భంగా ఉత్పన్నమైన పరిస్థితులపై అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అక్కడ స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం తాత్కాలిక మరమ్మతులతో కాకుండా బ్రిడ్జి నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు తయారు చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు.

భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జి కమ్ బ్యారేజీ లేదా బ్రిడ్జి కమ్ చెక్ డ్యామ్ తరహాలో నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి స్థాయి అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.కామారెడ్డి జీఆర్ కాలనీ సందర్శించిన సందర్భంగా ముఖ్యమంత్రి గారు బాధితులతో మాట్లాడారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున, పశుసంపద కోల్పోయిన వారికి సాయం అందించాలని ఆదేశించారు. “భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆస్తినష్టం జరిగినప్పటికీ అప్రమత్తంగా ఉండటం ప్రాణ నష్టం తగ్గించగలిగాం.

వరదలు రాగానే క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందిగా జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క గారిని, సలహదారు షబ్బీర్ అలీ గారిని, ఎంపీ సురేష్ షేట్కర్ గారిని, ఎమ్మెల్యేలను ఆదేశించాను. ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేశా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి వంద శాతం ప్రభుత్వం కృషి చేస్తుంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం..” అని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. కామారెడ్డి చేరుకునే సమయంలో ముఖ్యమంత్రి గారు హెలికాప్టర్ ద్వారా జిల్లాలో నష్టపోయిన ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా వీక్షించారు.

# జాతీయ విపత్తుగా పరిగణించాలి

(మొదటి పేజీ తరువాయి)

కోరినప్పటికీ... కేంద్రం నుంచి నిధులేమీ ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకుండా... కేవలం సాధారణ నిధులే విడుదలయ్యాయని గుర్తు చేశారు. దీంతో పరిస్థితులు చక్క దిద్దడంలో, పునర్నిర్మాణంలో ఇబ్బందులు తలెత్తాయని అమిత్ షాకు వివరించారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని గతంలో కోరిన రూ.11,713 కోట్లతోపాటు తాజాగా ప్రాథమిక అంచనా ప్రకారం... రూ.5,018 కోట్లు మొత్తం కలిపి రూ.16,732 కోట్లను కేంద్రం తక్షణమే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం నేతత్వంలోని బృందం అమిత్ షాకు విజ్ఞప్తి చేసింది.

72 గంటలపాటు కురిసిన వర్షాల తీవ్రతతో రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కేంద్ర మంత్రి అమిత్ షాకు డిప్యూటీ సీఎం భట్టి వివ రించారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా సాధారణ జీవన విధానానికి అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితిని జాతీయ విపత్తుగా పరిగణించాలని కేంద్ర హెూం మంత్రిని కోరారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇప్పటి వరకు రాష్ట్రంలో 22 మంది మృతి చెందారని, పాడి పశువులు చనిపోయాయని, గృహ, పంట నష్టాల గణన కొనసా గుతోందని తెలిపారు. కావున, తక్షణమే.. తెలంగాణ కు కేంద్ర బృందాలను సత్వరమే పంపాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విజ్ఞప్తిపై అమిత్ షా సానుకూలంగా స్పందించిట్టు అధికారులు తెలిపారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వ అధికా రుల బృందాన్ని తెలంగాణకు పంపి నష్టాలను అంచనా వేయిస్తామని అమిత్ షా హామీ ఇచ్చినట్టు వెల్లడించారు.

## వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ వాణిశ్రీ

**బలగం టీవీ, హైదరాబాద్**

గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వాణిశ్రీ సూచించారు. గణేష్ నిమజ్జనం, సంసిద్ధత, వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుంచి వర్చువల్‌గా వైద్యాధికారులతో ఆమె సమీక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రభలేందుకు అవకాశమున్న గణేశ్ నిమజ్జనం జరిగే ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.



## ఘనంగా కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు..

**బలగం టీవీ, బోయినిపల్లి**

బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో శ్రీనగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఒకే డ్రెస్ కోడ్ తో మహిళలు గణనాథునికి కుంకుమ పూజ నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, గణనాథునికి పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు.



## వెలిచాల నీ పోకడ మానుకో..

**మానకొండూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటీ**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు నీ వెలమ పోకడ మానుకో అని మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల వెంకన్న తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఫోటోను ఫ్లెక్సీలో పెట్టకుండా దళిత జాతి మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుంచి పార్టీని బ్రతికిస్తూ, నీలాంటి వెలమ దొర పోకడలను మట్టి కరిపించి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యునిగా గెలిచిన చరిత్ర మా నాయకుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దన్నారు. మీకు కూడా పార్టీలో టికెట్ అధిష్టానం తో ఇప్పించి మీ వెనకాల ఉండి మీకోసం ఆహర్నిశలు కష్టపడ్డ వ్యక్తికి ఇలా చేయడం తగదని,మర్యాదగా మా ప్రజానాయకుడు కవ్వంపల్లి సత్యనారాయణ కు క్షమాపణ చెప్పకపోతే మీ ఇంటిని ముట్టడిస్తామని తీవ్రంగా హెచ్చరిస్తున్నామని ఆయన అన్నారు.



## బాల గణపతికి ప్రత్యేక పూజలు..

**అన్నదాన కార్యక్రమం ఏర్పాటు..**

**బలగం టీవీ, బోయినిపల్లి**

గణపతి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని చివరి రోజు సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో ఆరో వార్డులో బాల గణపతికి గురువారం రోజున భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుని వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర కిషన్, చెంచు నాగరాజు, కదిరే శ్రీకాంత్,ఎర్ర రాజు, ఎర్ర అశోక్, ఆవుల నాగరాజు, ఆవుల లక్ష్మణ్, ఎర్ర నవీన్, పెంతల వేణు, తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో సిబ్బంది కొరతపై నిరసన..

**పనిభారం తగ్గించాలని సీఐటీయూ డిమాండ్ సోమవారం నుండి విధులు బహిష్కరణకు హెచ్చరిక..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పడకల సంఖ్యకు అనుగుణంగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు సిబ్బందిని తక్షణమే నియమించాలంటూ సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు.సిఐటియు ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్‌కు లేఖ అందజేసి, ఆసుపత్రి ముందు సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆసుపత్రిలో 330 పడకలు ఉండగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీసం 150 మంది సిబ్బంది (100 పడకలకు 45 మంది చొప్పున) ఉండాలని స్పష్టం చేశారు. అయితే కేవలం 77 మంది మాత్రమే పని



చేస్తుండటంతో సిబ్బందిపై రెట్టింపు పని భారం పడుతూ, అనారోగ్యాలు, ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో కూడా కలెక్టర్ సహా అధికారులు సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చినా అమలు జరగలేదని ఆయన మండిపడ్డారు. సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ వారం రోజుల్లో అదనపు సిబ్బందిని నియమించి భారం తగ్గిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. హామీని గౌరవించి వారం రోజుల్లో సిబ్బందిని నియమించకపోతే, సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాగమణి, భాగ్య, లత, సుజాత, జయ, తిరుపతి, రవి, లావణ్య, లలిత, మమత, స్నేహ, రంగయ్య, రమ, పుష్పలతతో పాటు పలువురు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, డాక్టర్లను, ఇంజనీర్లను, మేధావులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేననీ సర్వేపల్లి రాధాకృష్ణన్ ని విద్యార్థులు స్పూర్తిగా తీసుకుని ఉత్తమ పౌరులుగా రాణించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి అన్నారు. గురువారం రోజున జాతీయ సేవా పథకం మరియు సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. గురువులను శాలువాలతో సన్మానం చేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ బాల్యం నుంచే కష్టపడి చదివి ఆచార్యులుగా రాణించి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని, భారతదేశానికి ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా సేవలందించారనీ, "భారతీయ తత్వశాస్త్రం" పుస్తకం రచించారనీ, జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. గ్రాడ్యుయేట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి మేధావుల జీవితాలను విద్యార్థులు చదువాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ గజ్జెల గంగాధర్, అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, అనుముల రవిచంద్ర,జ్యాతోతు శ్రీను, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమీ బోధనేతర సిబ్బంది విమల్ కుమార్,ఎం.డి తాజోద్దీన్, షాహీన సుల్తానా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గంగాధర క్షేత్రంలో సామూహిక కుంకుమ అర్చన పూజలు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో వినాయక నవరత్రోత్సవాలను పురస్కరించుకొని గురువారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు ఉదయాన్నే ఆలయానికి చేరుకొని, మొదటగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం "శ్రీ దామోదర అన్నదాన సత్రంలో" అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అలయ అర్చకులు



మూగునాగరాజుశర్మ, నాగలింగంపతులు, నర్సయ్య పంతులు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు నిధులు విడుదల..

**వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ కళాశాలు, పాఠశాల మరమ్మతులకు నిధులు విడుదల..**

**హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు అధ్యాపకులు..**

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలకు 1 కోటి 35 లక్షలు ఇందులో చందుర్తి కేజీబీవీకి 58 లక్షలు, కోనరావుపేట 56 లక్షలు రుద్రంగి 8 లక్షలు, వేములవాడ రూరల్ 8 లక్షలు, వేములవాడ అర్బన్ 5 లక్షలు సర్వ శిక్ష నిధులు, రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 36 లక్షల 90 వేలు, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 24 లక్షల 15 వేలు, కొనరావుపేట 19 లక్షలు, చందుర్తి 18 లక్షల 47 వేలు మొత్తం 96 లక్షల 62 వేల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో ఆయా కళాశాలల్లో, పాఠశాలలో బిల్డింగ్ మరమ్మతులకు, విద్యుత్, త్రాగునీటి మరమ్మతులు, పారిశుద్ధ్యల అవసరాలకు వినియోగించుకోనున్నారు. నిధులు మంజూరకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కళాశాల సిబ్బంది, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల్లో,కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.

The details are as follows:

| Sl. No. | Name of the KGBV | Estd. cost (Rs. in lakhs) |
|---|---|---|
| 1 | KGBV, Boinpally | 5.000 |
| 2 | KGBV, Chandurthy | 58.000 |
| 3 | KGBV, Ellanthakunta | 8.000 |
| 4 | KGBV, Gambhiraopet | 13.000 |
| 5 | KGBV, Konaraopet | 56.000 |
| 6 | KGBV, Mustabad | 58.000 |
| 7 | KGBV, Rudrangi | 8.000 |
| 8 | KGBV, Siricilla | 8.000 |
| 9 | KGBV, Thangallapally | 53.000 |
| 10 | KGBV, Veernapally | 8.000 |
| 11 | KGBV, Vemulawada (Rural) | 8.000 |
| 12 | KGBV, Vemulawada (Urban) | 5.000 |
| 13 | KGBV, Yellareddypet | 56.000 |
| | Total | 344.00 |

In this regard, the Dist. Panchayat Raj Engineer, Rajanna Sircilla has submitted the line estimates with an estimated cost of Rs. 344.00 lakhs to take up the Repairs and Renovations in above (13) KGBVs Schools of Rajanna Sircilla District with a request to accord administrative sanction.

In view of the above, administrative sanction is hereby accorded for Repairs and Renovations in (13) KGBVs Schools of Rajanna Sircilla District with an estimated cost of Rs. 344.00 lakhs, as shown in the above table from the funds sanctioned under Samagra Shiksha vide ref. 1st cited, while keeping the Dist. Panchayat Raj Engineer, Rajanna Sircilla, as executing agency for execution.

# ఫిడే గ్రాండ్‌స్విస్‌లో గుకేశ్ శుభారంభం

బలగం టీవీ, హైదరాబాద్



భారత యువ గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ ఫిడే గ్రాండ్‌స్విస్ టోర్నీలో విజయంతో తన పయనాన్ని ప్రారంభించాడు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో గుకేశ్ ఫ్రాన్స్‌కు చెందిన ఎటిన్నె బాక్రొట్‌పై గెలుపొందాడు. నల్లపావులతో ఆడిన గుకేశ్ మొదటి నుంచే ఆధిపత్యం చెలాయించి గేమ్‌ను తనవైపు తిప్పుకున్నాడు. ఇక టాప్ సీడ్ అర్. ప్రజ్ఞానంద అమెరికాకు చెందిన జెఫ్రీ జియాంగ్‌తో తలపడి, తొలి గేమ్‌ను డ్రాగా ముగించాడు. గత ఏడాది చాంపియన్ విదిత్ గుజరాతీ మాత్రం విజయవంతమయ్యాడు. జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్‌పై గెలిచి విజయంతో తన టైటిల్ రక్షణ యాత్రను ఆరంభించాడు.

# పీకేఎల్ 2025లో తెలుగు టైటాన్స్ బోణీ

బలగం టీవీ, హైదరాబాద్



ప్రొకబడ్డీ ప్రీమియర్ లీగ్ (పీకేఎల్) 2025 సీజన్‌లో తెలుగు టైటాన్స్ ఎట్టకేలకు బోణీ చేసింది. వరుసగా రెండు పరాజయాల తర్వాత గురువారం విశాఖ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 37-32 తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది.కెప్టెన్ విజయ్ మాలిక్ (8 పాయింట్లు), ఆల్‌రౌండర్ భరత్ (8 పాయింట్లు) అద్భుత ప్రదర్శన కనబరిచి జట్టుకు విజయాన్ని అందించారు. రైడర్ చేతన్ సాహు (5), డిఫెండర్ అజిత్ పవర్ (5) కూడా రాణించారు. జైపూర్ తరఫున నితిన్ కుమార్ ఒంటరిగా 13 పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది.

ఫస్ట్ హాఫ్ నుంచే తెలుగు టైటాన్స్ ఆధిపత్యం చెలాయించింది. ప్రత్యర్థిని ఒకసారి ఆలౌట్ చేస్తూ, విరామ సమయానికి 16-9 ఆధిక్యంలో నిలిచింది. అయితే సెకండ్ హాఫ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ పుంజుకొని పోటాపోటీగా పాయింట్లు సాధించింది. కీలక సమయంలో భరత్ సూపర్ రైడ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. చివరి ఐదు నిమిషాల్లో విజయ్ మాలిక్ అద్భుత ప్రదర్శనతో టైటాన్స్ విజయాన్ని ఖరారు చేశాడు.

డిఫెన్స్‌లో అజిత్ పవర్ కీలకంగా ఆడగా, జైపూర్ రైడర్ అలీపై చేసిన సమాధి ట్యాకిల్ మ్యాచ్ హైలైట్‌గా నిలిచింది. ఆరంభంలో లాబీ లైన్ దాటిన జైపూర్ ఆటగాళ్లు సెల్ఫ్ ఔట్ కావడం టైటాన్స్‌కు అదృష్టం కలిగించింది. సమష్టిగా రాణించిన తెలుగు టైటాన్స్ ఎట్టకేలకు అభిమానులకు విజయానందం అందించింది.

# క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన అమిత్ మిశ్రా

బలగం టీవీ, హైదరాబాద్



భారత వెటరన్ లెగ్ స్పిన్నర్, ఐపీఎల్ హ్యాట్రిక్‌ల రారాజుగా గుర్తింపు పొందిన అమిత్ మిశ్రా తన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రొఫెషనల్ క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశాడు. తరచూ గాయాల బారిన పడటం, యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించాడు.

"క్రికెట్‌లో నా 25 ఏళ్ల ప్రయాణం ఎన్నో మధుర జ్ఞాపకాలను మిగిల్చింది. నాకు అండగా నిలిచిన బీసీసీఐ, హర్యానా క్రికెట్ అసోసియేషన్, సహచరులు, కోచ్‌లు, అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. క్రికెట్ నాకు అన్నీ ఇచ్చింది. మైదానంలో గడిపిన ప్రతీ క్షణం జీవితాంతం గుర్తుండిపోతుంది" అని మిశ్రా ఈ సందర్భంగా తెలిపాడు. ఇకపై కోచింగ్, కామెంటరీ, యువ క్రికెటర్లకు మెంటార్‌గా వ్యవహరిస్తూ ఆటకు దగ్గరగా ఉండాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు.

2003లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మిశ్రా భారత్ తరఫున 22 టెస్టుల్లో 76 వికెట్లు, 36 వన్డేల్లో 64 వికెట్లు, 10 టీ20ల్లో 16 వికెట్లు తీశాడు. 2008లో మొహాలీలో ఆస్ట్రేలియాపై తన తొలి టెస్టులోనే ఐదు వికెట్ల ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. 2013లో జింబాబ్వేతో జరిగిన వన్డే సిరీస్‌లో 18 వికెట్లు తీసి జవగళ్ శ్రీనాథ్ రికార్డును సమం చేశాడు. అంతర్జాతీయ స్థాయికి మించిన ఖ్యాతిని మిశ్రా ఐపీఎల్‌లో సంపాదించాడు. మూడు వేర్వేరు జట్ల తరఫున మూడు హ్యాట్రిక్‌లు సాధించిన ఏకైక బౌలర్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. 2008లో ఢిల్లీ డేర్‌డెవిల్స్, 2011లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్, 2013లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఈ ఘనత సాధించాడు.

ఐపీఎల్‌లో మొత్తం 162 మ్యాచ్‌లు ఆడి 174 వికెట్లతో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ల జాబితాలో ఏడో స్థానంలో నిలిచాడు. 2024 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున రాజస్థాన్ రాయల్స్‌తో ఆడిన మ్యాచ్ ఆయన కెరీర్‌లో చివరి ప్రొఫెషనల్ పోరుగా నిలిచింది.

# యూఎస్ ఓపెన్‌లో యుకీ బాంబ్రీ సంచలనం

- డబుల్స్ సెమీస్‌లో ప్రవేశం

బలగం టీవీ, హైదరాబాద్



భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు యుకీ బాంబ్రీ యూఎస్ ఓపెన్‌లో అదరగొడు తున్నాడు. న్యూజిలాండ్ సహచరుడు మైకేల్ వీనస్‌తో జోడీ కట్టి, పురుషుల డబుల్స్ సెమీస్‌కు అర్హత సాధించాడు. బుధవారం అర్ధరాత్రి జరిగిన క్వార్టర్స్‌లో బాంబ్రీ%-%వీనస్ ద్వయం 6-3, 6-7 (6/8), 6-3తో 11వ సీడ్ నికోలా మెక్టిక్ (క్రొయేషియా)%-%రాజీవ్ రామ్ (అమెరికా) జోడీపై విజయం సాధించింది. సీనియర్ గ్రాండ్‌స్లామ్‌లో సెమీస్ చేరడం బాంబ్రీ కెరీర్‌లో ఇదే తొలిసారి. ప్రిక్వార్టర్స్‌లో నాలుగో సీడ్ జర్మనీ జోడీ కెవిన్%-%పుటెజ్‌ను చిత్తుచేసిన ఈ ఇండో%-%న్యూజిలాండ్ జోడీ, సెమీస్‌లో ఆరో సీడ్ బ్రిటిష్ ఆటగాళ్లు జొ సల్స్‌బరీ%-%నీల్ కుప్సుకితో తలపడనుంది.

**సింగిల్స్‌లో సిన్నర్ దూకుడు**

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సిన్నర్ తన జోరును కొనసాగిస్తున్నాడు. క్వార్టర్స్‌లో ఇటలీ ఆటగాడు లొరెంజొ ముసెట్టిపై 6-1, 6-4, 6-2తో గెలిచి వరుసగా ఐదో గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరాడు. మరో క్వార్టర్స్‌లో 25వ సీడ్ ఫెలిక్స్ అగర్ అలియాస్సామి (కెనడా) 8వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)ను 4-6, 7-6 (9/7), 7-5, 7-6 (7/4)తో మట్టి కరిపించాడు. 2021 తర్వాత ఫెలిక్స్‌కు ఇది తొలి గ్రాండ్‌స్లామ్ సెమీస్. లాస్ట్ 4లో ఫెలిక్స్%-%సిన్నర్ పోరు జరగనుంది.

**మహిళల విభాగంలో సంచలనం**

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ ఇగా స్వియాటెక్ క్వార్టర్స్‌లో అమెరికా ఆటగాళ్ల అమండ అనిసిమోవ చేతిలో 4-6, 3-6తో ఓడిపోయింది. వింబుల్డన్ ఫైనల్లో స్వియాటెక్‌ను చిత్తుచేసిన అనిసిమోవాకు ఇది యూఎస్ ఓపెన్‌లో తొలి సెమీస్. మరో మ్యాచ్‌లో జపాన్ స్టార్ నవోమి ఒసాకా 6-4, 6-3తో కరోలినా ముచోవా (చెక్)పై విజయం సాధించి సెమీస్‌లోకి అడుగుపెట్టింది. దీంతో సెమీస్‌లో అమండ-ఒసాకా పోరు హోరాహోరీగా సాగనుంది.

# ఆసియా కప్ హాకీలో భారత్ జైత్రయాత్ర



- ఫైనల్ బెర్తుకు మరింత చేరువ

బలగం టీవీ, హైదరాబాద్

ప్రతిష్టాత్మక ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. గురువారం జరిగిన సూపర్%-%4 రెండో మ్యాచ్‌లో భారత్ 4%-%1 తేడాతో మలేషియాపై ఘన విజయం సాధించింది. ఈ విజయంతో భారత్ గ్రూపులో 4 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆదినుంచే ఆధిపత్యం చెలాయించిన భారత్ తరఫున మన్‌ప్రీత్ సింగ్ (17ని), సుఖ్‌జీత్ సింగ్ (19ని), శీలానంద్ లక్రా (24ని), వివేక్‌సాగర్ ప్రసాద్ (38ని) చెరో గోల్ సాధించారు. మరోవైపు మలేషియాకు షఫీక్ (2ని) ఏకైక గోల్ అందించాడు. సూపర్-4లో భారత్ ప్రదర్శనతో ఫైనల్ చేరే అవకాశాలు మరింత బలపడ్డాయి.

## 'శివంభజే'కు ప్రతిష్టాత్మక అవార్డు

- మోస్ట్ అస్పైరింగ్ డైరెక్టర్‌గా అప్సర్ ఎంపిక

బలగం టీవీ, హైదరాబాద్



టాలీవుడ్ యాక్టర్ అశ్విన్ బాబు హీరోగా, అప్సర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'శివంభజే' మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. మాస్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రానికి విమర్శకులు, మూవీ లవర్స్ ప్రశంసలు కురిపించారు.ఈ క్రమంలో దర్శకుడు అప్సర్‌కు ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్స్‌లో మోస్ట్ అస్పైరింగ్ డైరెక్టర్ విభాగంలో అవార్డు దక్కింది. దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో జరిగిన అవార్డు కార్యక్రమంలో అప్సర్ ఈ గౌరవాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జ్యూరీకి, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

# అనుష్క శెట్టి 'ఘాటి' ప్రచారంలో కొత్త పంథా

**అల్లు అర్జున్‌తో ఫోన్ సంభాషణ ఆడియో వైరల్**

బలగం టీవీ, హైదరాబాద్



అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించిన 'ఘాటి' చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న వేళ, చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వినూత్న పంథాను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, అనుష్కల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ ఆడియోను నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ విడుదల చేసింది. దాదాపు ఆరు నిమిషాల నిడివి గల ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

ఈ సంభాషణలో అల్లు అర్జున్, అనుష్కలు 'వేదం', 'రుద్రమదేవి' చిత్రాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. "నిన్ను స్వీటీ అని పిలవాలా లేక ఘాటి అని పిలవాలా?" అని అల్లు అర్జున్ సరదాగా అడగ్గా, అనుష్క "ఎప్పుడూ స్వీటీనే" అని సమాధానమిచ్చారు. తన సినిమాలకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలిచే అల్లు అర్జున్‌ను ఆమె ప్రశంసించారు. 'పుష్ప' చిత్రంలోని పుష్పరాజ్ పాత్ర సమాజంపై సానుకూల ప్రభావం చూపిందని కూడా పేర్కొన్నారు. దీనికి స్పందించిన అల్లు అర్జున్, 'ఘాటి'లోని శీలావతి పాత్ర గురించి ఆరా తీశారు. యాక్షన్ సన్నివేశాల్లో అనుష్కనే అగ్రస్థానంలో ఉంటారని కొనియాడారు. 'ఘాటి' సినిమాకు 'పుష్ప' ప్రపంచంతో సంబంధం ఉందన్న ప్రచారంపై అనుష్క స్పందిస్తూ, అది తన సరదా వ్యాఖ్య మాత్రమేనని, అసలు సంబంధం లేదని స్పష్టం చేశారు.అల్లు అర్జున్ అడిగిన "పుష్పరాజ్, శీలావతి ఒకే సినిమాలో నటిస్తే దానికి ఎవరు దర్శకత్వం వహిస్తే బాగుంటుంది?" అన్న ప్రశ్నకు అనుష్క చమత్కారంగా స్పందించారు. "ఆ సమాధానం చెప్పడం కష్టం.. సుకుమార్, క్రిష్ ఇద్దరూ నాకు ఎంతో ముఖ్యమైనవారు" అని తెలిపారు.

క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఘాటి' సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఆడియో కాల్ సినిమా ప్రమోషన్లకు మరింత ఊపునిచ్చింది.